సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 17 । మే । 2023



ధాన్యం కుప్పలు బుగ్గిపాలు
పోలవరం మండలం కొత్తపట్టిసీమలో అగ్నిప్రమాదంలో రూ.25 లక్షల విలువైన వరికుప్పలు బూడిదయ్యాయి. 3 కిలో మీటర్ల మేర మంటలు వ్యాపించాయి. 8లో



విశాఖకు ప్రత్యేక బస్సులు
వేసవి సందర్భంగా విశాఖపట్నం విహార యాత్రకు పశ్చిమ గోదావరి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. 8లో



నాయీ బ్రాహ్మణ క్రికెట్ పోటీలు
భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. 8లో

మామిడి ముంచేసింది!

- వాతావరణ మార్పులతో భారీగా తగ్గిన దిగుబడి
- నాణ్యత లేక గిట్టుబాటు ధర కరవు
- అయోమయంలో మామిడి రైతులు

ఏలూరు(మెట్రో): ఈ ఏడాది మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో మామిడి పంట దిగుబడి బాగా పడిపోయింది. వచ్చిన పంట కూడా నాణ్యంగా లేకపోవడంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. దీంతో ఈ ఏడాది బాగా నష్టపోయామని రైతు ఆవేదన చెందుతున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడి రైతు ఈ ఏడాది నష్టపోయాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతయ్యే మామిడికి ప్రస్తుతం సొంత రాష్ట్రంలోనూ సరైన ధర దక్కని పరిస్థితి. అసలే కాపు తక్కువగా రావడం, మూడు దఫాలుగా వచ్చిన గాలి దుమ్ములు, అకాల వర్షాలకు, ఎండ వేడిమికి పూత పిందె, కాయ ఇలా అన్ని దశల్లోనూ రాలిపోయింది. అక్కడక్కడా కొన్ని కాయలు ఉన్నా, ఆ కాయలకు మంగు మచ్చ ఆశించడంతో కనీసం ఎకరాకు రూ.30 వేలు కూడా దక్కని పరిస్థితి.

కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి

జిల్లాలో బంగినపల్లి, రసాలు అధికంగా ఉత్పత్తి అయ్యేవి. రైతుకు ఈ రకాలే అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టేవి. ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, ఏప్రిల్ నెలలో విపరీతమైన ఎండల వల్ల పంట దెబ్బ తింది. దీంతో కనీసం కూలీ ఖర్చులు కూడా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలకు, అధిక ఉష్ణోగ్రతలకు మామిడి నాణ్యత లేకుండా రైతును ముంచేసింది.



నూజివీడు మండలం దిగవల్లిలో వడదెబ్బకు రాలిన మామిడి కాయలు



ఇతర రాష్ట్రాలకు తగ్గిన ఎగుమతులు

కాయపై మచ్చ ఏర్పడటంతో మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎగుమతి కావాల్సిన మామిడి స్థానికంగానే ఉండిపోతోంది. గతంలో నూజివీడు రసాలు అంటే ఇతర రాష్ట్రాలకు ఎంతో ప్రసిద్ధి. అలాంటి నూజివీడు ప్రాంతంలో రైతులు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు. ఆగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి, ముసునూరు, చింతలపూడి మండలాల్లో 14 వేల హెక్టార్లలో మామిడి విస్తరించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులంతా నష్టపోయారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి మాట పక్కన పెడితే స్థానికంగా ఉన్న నున్న మార్కెట్‌లోనూ రైతు ఆశించిన ధర లభించడం లేదు.

మొగల్తూరులోనూ అదే పరిస్థితి

గతంలో మంచి రంగు, మచ్చలేని మామిడి కాయలను టన్ను రూ.40 వేలకు విక్రయించే వారు. ప్రస్తుతం స్థానిక నున్న మార్కెట్‌లో మచ్చలున్నవి కనీసం రూ.10 వేలకు కూడా కొనడం లేదు. గతంలో 20 వేల టన్నుల దిగుబడి ఉన్న మామిడి ఈ ఏడాది 3 నుంచి 5 టన్నుల కూడా ఉత్పత్తి రాలేదు.

వచ్చిన కాయ సైతం మంగు, మచ్చలతో ఉండటంతో కనీసం కొనే నాథుడే కరవవయ్యాడు. ఇదిలా ఉండగా, ఆలస్యంగా వచ్చే నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 2 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న మామిడి కాపు ప్రస్తుతం ఆశాజనకంగా లేదని రైతులు చెబుతున్నారు. మామిడికి ప్రసిద్ధి చెందిన ఉమ్మడి జిల్లాలో రైతు ఢీలా పడ్డాడు. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో పూర్తిగా రైతులు మామిడి పంటను తొలగించేశారు. గతంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం మండలాల్లో మామిడి పంట ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాలుగా ఉన్న అరకొర చెట్లను సైతం పెకిలించేశారు. రానున్న రోజుల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులే కొనసాగితే జిల్లాలో మామిడి పంట అంతరించి పోయే పరిస్థితి ఏర్పడనుంది.

కొనేందుకు ముందుకు రావడం లేదు



గతంలో ఎకరాకు రూ.40 వేలు కౌలు వచ్చేది. అకాల వర్షాలతో వాతావరణ మార్పులతో ప్రస్తుతం పేను బంక, మంగు మచ్చలు రావడంతో మామిడి కాయ పూర్తి నాణ్యత కోల్పోయింది. ఆశించిన ధర లేదు సరికదా, స్థానికంగా కూడా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు.

– శీలపురెడ్డి నాగిరెడ్డి, మామిడి రైతు

ధాన్యం రవాణా ప్రారంభం



మార్టేరులో శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్ రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యం లోడు వాహనాలు

పెనుమంట్ర : పెనుమంట్ర మండలంలో వారం రోజులుగా రైస్‌మిల్లులకు రైతు భరోసా కేంద్రాల నుంచి ధాన్యం రవాణా నిలిచిపోవడంతో రైస్‌మిల్లులు వెలవెలబోయాయి. ధాన్యం రాకపోవడంతో కూలీలు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు జిల్లా అధికారులతో సంప్రదించి ధాన్యం రవాణాకు మళ్లీ మార్గం సుగమం చేశారు. దీంతో మంగళవారం నుంచి ఒకొక్క రైస్‌మిల్లుకు ధాన్యం రవాణా ప్రారంభమైంది. మార్టేరులోని శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్‌కు ఒక్కసారిగా సుమారు 25 ట్రాక్టర్లు, లారీల ధాన్యం లోడు రావడంతో దిగుమతి చేసుకోవడం కష్టసాధ్యమైంది.

బార్‌లో ఉద్యోగిపై దాడి

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని గాయపర్చిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బానాల లక్ష్మణరావు, వంశీకృష్ణ, షేక్ ఖాసిం, మరికొందరితో కలిసి స్థానిక బార్‌లో మద్యం సేవించాడు. బిల్లు చెల్లించే విషయంలో గొడవ తలెత్తడంతో షేక్ ఖాసిం, మరికొంతమంది బీరుసీసాతో లక్ష్మణరావు తలపై కొట్టారు. వెంట వచ్చిన వంశీకృష్ణను సైతం కొట్టారు. పోలీసులు వారిద్దరిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

మావుళ్లమ్మను దర్శించుకున్న డీఐజీ



మావుళ్లమ్మ సన్నిధిలో డీఐజీ అశోక్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదం అందచేశారు. పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామిని కూడా డీఐజీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు.

పోలీసు అధికారులతో డీఐజీ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం : ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మంగళవారం భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా ఎస్పీ రవిప్రకాష్ డీఐజీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీసుస్టేషన్ల వారీగా నమోదైన కేసులు, పరిష్కారం కాని కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చించినాడలో ధాన్యం చెక్‌పోస్ట్



చెక్‌పోస్ట్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

యలమంచిలి: ధాన్యం అక్రమ రవాణాను అరికట్టడానికి చించినాడ గ్రామంలోని వశిష్ట గోదావరి వంతెన వద్ద ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్‌లో వెంటనే ధాన్యం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం చెక్‌పోస్ట్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు మంగళవారం ఆయన నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజతో కలిసి చించినాడ వచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ధాన్యం జిల్లా సరిహద్దులు దాటకుండా వెంటనే చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రెవెన్యూ, పోలీస్, కోఆపరేటివ్ మార్కెటింగ్ మూడు శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంగా విధులు పంచుకుని 24 గంటలు మూడు షిఫ్టులలో చెక్‌పోస్ట్ పని చేసేలా షెడ్యూల్ వేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించాలి



భీమవరం బీవీరాజు కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారిని భాగస్వాముల్ని చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీవీ రాజు కళాశాల సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులకు ఏర్పాటుచేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. విజువల్ శానిటేషన్‌తో అధికారులంతా భాగస్వాములై మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. రోడ్లు, డ్రెయినేజీల్లో చెత్త లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ క్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శానిటేషన్ చేపట్టే గ్రామాలను మూడు రకాలుగా విభజించి శానిటేషన్ బాగున్న గ్రామాలను గ్రీన్, మధ్యస్థంగా ఉన్న గ్రామాలను ఎల్లో, శానిటేషన్ బాలేని గ్రామాలను రెడ్‌జోన్‌గా గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్, డీపీఓ జీవీ మల్లిఖార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామస్వామి, డ్వామా పీడీ యస్‌టివి రాజేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు భరోసా

1,635 మంది లబ్ధిదారులకు రూ.1.63 కోట్లు విడుదల



మత్స్యకార భరోసా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

భీమవరం (ప్రకాశం చౌక్) : వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా అండగా నిలుస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని మత్స్యకార భరోసాను బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక భరోసా కోసం వేట నిషేధ కాలంలో సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జిల్లాలో 1,635 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ.1.63 కోట్లు విడుదల చేశారన్నారు. వీరిలో మొగల్తూరు మండలంలో 690 మంది, నరసాపురం మండలంలో 945 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో విస్తరించి ఉన్న సముద్ర తీర ప్రాంతంలో 3,500 వరకు మత్స్యకార కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరిలో 1,635 మంది లబ్ధిదారులకు మత్స్యకార భరోసాను జమ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను గమనించి ప్రభుత్వానికి అండగా నిలవాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. మత్స్యశాఖ జేడీ ఆర్జీవీఎస్ ప్రసాద్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు అంర్రాజు చల్లారావు, వైస్ ప్రెసిడెంట్ నాగిడి భానుమూర్తి, నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, లక్ష్మణేశ్వరం సర్పంచ్ తిరుమానివెంకట రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- ఉమ్మడి జిల్లాలో కొనసాగిన సూర్యుడి భగభగలు
- ఆగిరిపల్లి, పోలవరంలో అత్యధిక ఉష్ణోగ్రత
- నేడు కాస్త తగ్గవచ్చంటున్న వాతావరణ శాఖ



ఏలూరు(మెట్రో): భానుడి భగభగలతో ఉమ్మడి జిల్లాలో జనం అల్లాడుతున్నారు. గత రెండు రోజులుగా ఎండ ప్రచండంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వేడిగాలులకు ఇళ్లల్లో సైతం జనం ఉండలేని పరిస్థితి. ఉదయం నుంచే భానుడి భగభగలతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 8 గంటలకు మొదలైన ఎండ వేడిమి సాయంత్రం 6.30 వరకు కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు మంగళవారం సైతం కొనసాగాయి. ప్రతీ మండలంలోనూ 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో అత్యధికంగా 46 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, పోలవరంలో 45.8 డిగ్రీలు, ద్వారకాతిరుమలలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు మండలంలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం ప్రతి మండలంలోను ఉష్ణోగ్రతలు ప్రజల్ని అల్లాడించాయి. బుధవారం ఉష్ణోగ్రతలు కొంత తగ్గవచ్చని.. 38 నుంచి 42 డిగ్రీల మధ్యలో నమోదు కావచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటించింది. అయితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ రెండు మూడు రోజులు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

పశ్చిమగోదావరి జిల్లా ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

మండలం	మంగళ వారం	బుధవారం అంచనా
ఆచంట	43.8	37.0
ఆకివీడు	43.3	37.5
భీమవరం	42.6	37.9
ఇరగవరం	43.0	38.2
కాళ్ల	39.3	36.1
మొగల్తూరు	43.1	33.2
నరసాపురం	44.1	34.0
పాలకోడేరు	43.0	36.8
పాలకొల్లు	44.5	36.0
పెంటపాడు	43.3	38.6
పెనుగొండ	42.9	37.7
పెనుమంట్ర	43.1	37.6
పోడూరు	43.8	36.7
తాడేపల్లిగూడెం	42.7	39.1
తణుకు	45.1	38.7
ఉండి	43.0	37.4
వీరవాసరం	41.8	36.5
యలమంచిలి	42.8	35.5

చిన్నారిపై బాలుడి అత్యాచార యత్నం

కాళ్ల: ఆకివీడు మండలం రాజుల పేట పంచాయతీ కొత్తచెరువు గ్రామంలో ఐదేళ్ల చిన్నారిపై 17 ఏళ్ల బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు ఆకివీడు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలికను అన్నయ్య వరసైన బాలుడు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నాన్నమ్మ ఇంటికి వెళ్దామని తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించగా బాలిక ఏడవటంతో తీసుకొచ్చి ఇంటి వద్ద వదిలేశాడు. చిన్నారిని తల్లి ఎక్కడికి వెళ్లావు అని ప్రశ్నించగా.. జరిగిన విషయం తల్లికి చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సంజీవరావు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ త్రినాథ్, ఎస్సై రాజారెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

లాంగ్వేజ్ పండిట్ పరీక్షల్లో 786 మంది ఉత్తీర్ణత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత జనవరిలో 2019-20, 2020-21 బ్యాచ్‌లకు సంబంధించి నిర్వహించిన లాంగ్వేజ్ పండిట్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 811 మంది హాజరు కాగా 786 మంది 96.90 శాతంతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అభ్యర్థులు, కళాశాలల సమాచారం కోసం డమ్మీ మార్కుల మెమోరాండం బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయానికి నేరుగా ఫీజు చలానాతో పాటు సమర్పించాలని సూచించారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలని సూచించారు. దరఖాస్తులను టీవీఆర్ ప్రభావతి, అదనపు జాయింట్ సెక్రటరీ ఆఫీస్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా, గొల్లపూడి, విజయవాడ -521225 చిరునామాకు పంపాలన్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

కైకలూరు: వడదెబ్బకు గురై వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకివీడు జానకినగర్‌కు చెందిన గాజుల బుచ్చిరామకృష్ణ(72) మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 13న నడుచుకుంటూ ఆలపాడు వచ్చి సమీపంలో ఎండదెబ్బకు పడిపోయాడు. రూరల్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుపై రూరల్ పోలీసలు కేసు నమోదు చేశారు.

చెత్త నుంచి సంపద

- పంచాయతీల్లో విజయవంతంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం
- జిల్లాలో 365 స్వచ్ఛ సంకల్పం యూనిట్లు
- వర్మి కంపోస్టు, ప్లాస్టిక్ విక్రయంతో ఆదాయం

భీమవరం(ప్రకాశం చౌక్) : జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు చెత్త ద్వారా సంపదను సృష్టిస్తున్నారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకాన్ని 2021 అక్టోబరు నుంచి జిల్లాలో అమలు చేస్తోంది. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను సేకరించి దానిని గ్రామంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యూనిట్లకు తరలించి అక్కడ చెత్తాను వేరుచేస్తారు. చెత్తను సేకరించడానికి క్లాప్ మిత్రలు పనిచేస్తున్నారు. గ్రామాల్లో చెత్తా ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా నేరుగా డంపింగ్ యూనిట్లకు తరలిస్తారు. దాంతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువ గట్లపై చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంటున్నాయి.

విజయవంతంగా చెత్త నుంచి సంపద సృష్టి

తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను డంపింగ్ యూనిట్లకు తరలిస్తారు. అక్కడ పొడి, తడి చెత్త, ప్లాస్టిక్ చెత్త విభాగాలు ఉంటాయి. తడి పొడి చెత్తలను కలిపి వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చుతారు. ఆ ఎరువును కిలో రూ.10 చొప్పున రైతులకు విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ కూడా కిలో రూ.8 నుంచి రూ.10 చొప్పున ప్లాస్టిక్ వ్యాపారాలకు విక్రయిస్తూ చెత్త నుంచి సంపదను సృష్టిస్తున్నారు.

జిల్లాలో 365 యూనిట్లు

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం పంచాయతీలు 409 ఉండగా ఇంతవరకు 365 చెత్త సేకరణ యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరో 41 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. అన్ని పంచాయతీల్లో నూరు శాతం డంపింగ్ యూనిట్లు ఉండేలా జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 4.18 లక్షల ఇళ్ల నుంచి సేకరణ

జిల్లాలో 4.18 లక్షల ఇళ్ల నుంచి తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను సేకరిస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి రోజుకు సుమారు 450 కిలోలపైనే చెత్తను సేకరిస్తున్నారు.

ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం

జిల్లాలో 2021 అక్టోబరు నుంచి ఈ పథకం ప్రారంభించగా ఏడాదికి సుమారు రూ.3 లక్షల చొప్పున ఆదాయం వస్తుంది. జగనన్న స్వచ్ఛ సంకల్పం(జేఎస్ఎస్) యాప్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారి దగ్గర నుంచి ఈవోపీఆర్డీ, పంచాయతీ సెక్రటరీ వరకు జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకాన్ని పర్యవేక్షిస్తున్నారు. యాప్‌లో చెత్త సేకరణ వివరాలను స్థానిక పంచాయతీ అధికారులు అప్‌లోడ్ చేస్తారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ఉండి గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ డంపింగ్ యూనిట్

జిల్లాలో మండలాలు	: 20
గ్రామ పంచాయతీలు	: 409
చెత్త సేకరణ యూనిట్లు	: 365
చెత్త సేకరణ కోసం వాహనాలు	: 1140
చెత్త సేకరణ చేసే క్లాప్ మిత్రలు	: 1164 మంది

చెత్త నుంచి సంపద సేకరణ



జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం ద్వారా ప్రతి గ్రామంలో తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సేకరించిన చెత్త ద్వారా సంపద సృష్టించడం విజయవంతంగా కొనసాగుతుంది. జిల్లాలో డంపింగ్ యూనిట్లు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– జీవికె మల్లిఖార్జునరావు
జిల్లా పంచాయతీ అధికారి భీమవరం

ఈఏపీ సెట్‌కు 2,905 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష రెండో రోజు మంగళవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 10 కేంద్రాల్లో మొత్తం 2,905 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్‌లో జరిగిన పరీక్షల్లో ఉదయం 180 మందికి 175 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 180 మందికి 173 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 131 మందికి 129 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 130 మందికి 128 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 147 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 150 మందికి 142 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1,042 మందికి 1,004 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1,040 మందికి 1007 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

కలప దుంగలు స్వాధీనం



కన్నాపురం అటవీశాఖ కార్యాలయంలో అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

కొయ్యలగూడెం: అక్రమంగా కారులో రవాణా చేస్తున్న కలపను మంగళవారం తెల్లవారుజామున సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం ఫారెస్ట్ రేంజర్ కె.కృష్ణకుమారి చెప్పారు. బండారు కలప జాతికి చెందిన పదకొండు దుంగలను తరలిస్తుండగా దొండపూడి ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేలకు పైగానే ఉంటుందని ఆమె తెలిపారు. కలప రవాణా చేస్తున్న కారుతో సహా దుంగలను కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.కన్నయ్య, ఎఫ్బీవోలు ఈ.సుధాకర్, నవ తేజ, శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న గురుకుల ప్రవేశ పరీక్షలు

టి.నరసాపురం: జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 20న ఏలూరులో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్ టీఎస్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి గాను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కళాశాలలో ప్రవేశానికి గాను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను 'ఏపీఆర్ఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్' వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

వీరవాసరం: మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. రాయకుదురుకు చెందిన కోంద్రు సత్యనారాయణ, పెద్దిరెడ్డి వెంకట సత్యనారాయణ, బెల్లంకొండ వెంకట్రావు అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధాన్యం కుప్పలు బుగ్గిపాలు



కొత్తపట్టిసీమ గ్రామంలో పొలాల్లో చెలరేగుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

- కొత్తపట్టిసీమలో భారీ అగ్నిప్రమాదం
- 3 కి.మీ మేర ఎగిసిపడ్డ మంటలు
- 45 ఎకరాల్లో 24 ధాన్యం కుప్పలు దగ్ధం
- రూ.25 లక్షల నష్టం.. తల్లడిల్లిన రైతులు

పోలవరం రూరల్: కొత్తపట్టిసీమ గ్రామంలో మంగళవారం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు రూ.25 లక్షల విలువైన వరికుప్పలు కాలి బూడిదయ్యాయి. రైతులు ఇటీవల వరిచేలు కోసి కుప్పలు వేశారు. కొందరు రైతులు మొక్కజొన్న పంట వేసి సేద్యం పూర్తికావడంతో పంట చేతికి వచ్చింది. ఖాళీగా ఉన్న మొక్కజొన్న చేలల్లో తుక్కును తగులబెట్టి ఉండవచ్చని, లేదా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు పడి మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

3 కిలోమీటర్ల పొడవున ఎగసిన మంటలు

మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు గంటల వ్యవధిలోనే సుమారు మూడు కిలోమీటర్ల పొడవున వ్యాపించాయి. భారీస్థాయిలో ఎగసిపడిన మంటలతో పొలాల్లో వేసిన వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. అప్పటివరకు పొలాల్లోనే ఉన్న రైతులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రమాదం జరగడానికి ముందు ఇళ్లకు చేరుకున్నారు. ఆ సమయంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న రైతులు ఉరుకులు పరుగులతో పొలాల్లోకి చేరుకోగా, అప్పటికే మంటలు చెలరేగి ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలి బూడిదవుతుంటే తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కౌలుకు భూములు తీసుకుని వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట పండించామని వాపోతున్నారు. ఈ ఏడాది ఎకరానికి 40 బస్తాలకు పైగా పండిందని, దిగుబడి కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు. తీరా కళ్లముందే కాలి బూడి కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోయారు. పొలాల మధ్యలోని రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల పొడవునా పెద్ద పెద్ద మంటలు ఎగిసిపడ్డాయి. ఎండిపోయి ఉన్న మొక్కజొన్న, వరి చేలు కావడంతో గంటల సమయంలో పూర్తిగా పొలాలు దగ్ధమయ్యాయి. సుమారు 45 ఎకరాల్లోని 24 వరికుప్పలు పూర్తిగా దగ్ధమైనట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 126 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, సుమారు రూ.25 లక్షల వరకు పంట నష్టం ఏర్పడి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పొలాల్లో ఉన్న మోటార్లు, ఇంజిన్లు, సోలార్ లైట్లు కాలి బూడిదయ్యాయి.



కాలిన వరికుప్పలను పరిశీలిస్తున్న అధికారులు

రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలు అదుపు

ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రాజమండ్రి, నిడదవోలు నుంచి రెండు ఫైర్ ఇంజిన్లలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఆయా ప్రాంతాలను నీటితో తడిపి అదుపుచేశారు.

పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి, డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఏడీవీ పీజీ బుచ్చిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. నష్టంపై ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రమాదం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వీరి వెంట సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, డీటీ కె.రమేష్ ఉన్నారు.

విశాఖ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ప్రజా రవాణా అధికారి ఎం.వీరయ్య చౌదరి

భీమవరం(ప్రకాశం చౌక్): విశాఖ విహార యాత్రకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వీరయ్య చౌదరి మంగళవారం చెప్పారు. వేసవి సెలవుల సందర్భంగా విశాఖపట్టణంలోని సుప్రసిద్ధ ప్రదేశాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ యాత్రలో సింహచలం, కై లాసగిరి, ఉడా పార్క్, నేవీ మ్యూజియం, ఆర్కే బీచ్, కాళీ టెంపుల్, జూ పార్క్ తదితర వాటిని తిలకించేలా టూర్ ప్లాన్ చేశామన్నారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి శనివారం రాత్రి ప్రత్యేక బస్సులు బయలుదేరి ఆదివారం విహారయాత్ర చూసుకుని సోమవారం ఉదయం నాటికి తిరిగి డిపోలకు చేరుకుంటాయన్నారు. రిజర్వేషన్ అందుబాటులో ఉందన్నారు. భీమవరం డిపో నుంచి సూపర్‌ల గ్జరీ వీడియో కోచ్ చార్జీ రూ.1,150, నర్సాపురం డిపో నుంచి రూ.1,110, తాడేపల్లిగూడెం డిపో నుంచి రూ.1,100, తణుకు డిపో నుంచి రూ.1040 కాగా, నర్సాపురం డిపో నుంచి ఇంద్ర చార్జీగా రూ.1,380, తణుకు డిపో నుంచి రూ.1,290, తాడేపల్లిగూడెం డిపో నుంచి రూ.1,330గా ఉంటుందని తెలిపారు. అలాగే గత మూడు నెలలుగా అరుణచలం యాత్రకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ బస్సులకు విశేష స్పందన లభించిందన్నారు. దీంతో భక్తుల కోరిక మేరకు మరిన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు ఆర్టీసీ కల్పిస్తున్న ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ఏసీ బస్సుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వీరయ్య చౌదరి తెలిపారు.

ఆక్వా వర్సిటీ పనులను వేగిరపర్చండి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశం
- యూనివర్సిటీ ఓఎస్డీ సుధాకర్‌తో కలిసి పనుల పరిశీలన



లిఖితపూడిలో ఆక్వా యూనివర్సిటీ పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నరసాపురం నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఆక్వా యూనివర్సిటీకి సంబంధించి ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వెల్లడించారు. మంగళవారం నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో నిర్మిస్తున్న ఆక్వా యూనివర్సిటీ పనులను వర్సిటీ ఓఎస్డీ సుధాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలనే ధ్యేయంతో నిర్మాణ పనులు వేగవంతం చేశామన్నారు. ఈ ఏడాది జూన్ లేదా జూలై నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. లిఖితపూడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వర్సిటీ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామని, అందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని అధికారులకు సూచించారు. సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవన సముదాయం నిర్మితమవుతోందన్నారు. రూ.332 కోట్లు పరిపాలనా ఆమోదం లభించగా, ఇప్పటికే రూ.100 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ యూనివర్సిటీ వల్ల ఆక్వా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆక్వా, మత్స్య రంగంలో రాష్ట్రం అగ్రగామిగా ఉన్నప్పటికీ మరింత మంది నిపుణుల అవసరం ఉందన్నారు. ఈ యూనివర్సిటీ వల్ల రానున్న రోజుల్లో వచ్చే నూతన ఆవిష్కరణలతో అత్యాధునిక సాంకేతిక పరికరాలు, తక్కువ పెట్టుబడులతో ఆక్వా సాగులో అధిక దిగుబడులు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తొలుత ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్ట్ కంపెనీ కూడా అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేశంలో మూడోదిగా నిర్మిస్తున్న ఈ యూనివర్సిటీ నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆక్వాయూనివర్సిటీ భవనాల ఊహాచిత్రాన్ని అధికారులతో కలసి ప్రసాదరాజు పరిశీలించారు. వీరివెంట ఆక్వా యూనివర్సిటీ ఓఎస్డీ సుధాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఆత్మా కమిటీ చైర్మన్ కడలి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు చిన్నం వెంకట్రావు, బర్రి శంకర్, దొంగ మురళీకృష్ణ, చొప్పల సూర్యప్రకాష్, పోతురాజు గమిడి మధు, పోలిశెట్టి గోపీనాథ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ జి.నాగేంద్రబాబు, ఏఈ కె.ఆనందరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.సీతారత్నం, వీఆర్వోలు, జయరాం, రమేష్, లక్ష్మీనారాయణ, సర్వేయర్లు విజయ్, పవన్ ఉన్నారు.

గడపగడపకు సంక్షేమం



పాలకొల్లు అర్బన్: భగ్గేశ్వరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ముగిసిన నాయీబ్రాహ్మణ రాష్ట్ర క్రికెట్ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఓటమి గెలుపునకు పునాది వంటిదని, అందువల్ల పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో గన్నాబత్తుల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాయీ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగియడంతో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 14 జట్లు పాల్గొనగా విజయవాడ ఎస్‌డీఎంఎస్ జట్టు విన్నర్స్‌గా, విజయవాడ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. విన్నర్స్ జట్టుకు రూ.30 వేల నగదు, షీల్డ్, రన్నర్స్ జట్టుకు రూ.20 వేల నగదు, షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో చెన్నమల్ల చంద్రశేఖర్, కోడే యుగంధర్, బండి రమేష్‌కుమార్, బన్ను ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు కోడూరి రామకృష్ణ, పాతర్లపల్లి చిన్న, భీమవరపు వెంకట్, ఏసు, సాయి, ప్రవీణ్, మనోహర్, మల్లేశ్వరరావు, సత్తిపండు, సూరి తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నగరం.. నిప్పుల కొలిమి

ఏలూరు నగరం మంగళవారం నిప్పుల కొలిమిని తలపించింది. నగరంలో అత్యధికంగా 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. తీవ్ర ఎండ వేడిమితో ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితయ్యారు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు - సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



బిడ్డకు ఎండ తగలకుండా..



నిర్మానుష్యంగా మారిన కార్పొరేషన్ కార్యాలయం రోడ్డు



గొడుగు రక్షణలో..



బైక్‌పై వెళుతూ.. జాగ్రత్తలు పాటిస్తూ..

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: యువతిని మోసం చేసిన నేరంపై యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన కథనం ప్రకారం .. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం గ్రామానికి చెందిన ఓ యువతికి జంగారెడ్డిగూడెంలో ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో తాడువాయి గ్రామానికి చెందిన టి.పవన్ కల్యాణ్‌తో పరిచయమైంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా పవన్‌కల్యాణ్ నిరాకరించడంతో పాటు చంపుతానని బెదిరించాడు. గతంలో వీరి పెళ్లికి పవన్‌కల్యాణ్ తండ్రి అంగీకరించాడు. దీంతో అతనిని కలిసి పెళ్లి చేయాలని కోరగా అతను కూడా బెదిరించాడు. దీంతో బాధితురాలు పవన్‌కల్యాణ్, అతని తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతర ఉత్సవం.. భక్తజనసంద్రం



పట్టణంలోని చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మవారి 51వ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరలో కళాకారుల నృత్య ప్రదర్శనల కోసం ప్రధాన రహదారుల్లో 12 స్టేజీలను ఏర్పాటు చేశారు. రాత్రి 1 గంట సమయంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. జాతర ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం అమ్మవారిని పట్టణంలో ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. - పాలకొల్లు సెంట్రల్

ఇళ్ల పట్టాల పంపిణీపై సుప్రీంలో స్టే నిరాకరణపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు వేసిన కేసులో సుప్రీంకోర్టు స్టే విధించేందుకు నిరాకరించడంపై మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. జువ్వలపాలెంలో మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం అత్యవసర సమావేశం జరిగింది. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ నిరాహార దీక్షలకు మంగరాజు మద్దతు ప్రకటించారు. సీఆర్‌డీఏకు భూములు ఇచ్చిన తరువాత ఆ భూములపై రైతులకు ఏమి హక్కులు ఉంటాయని, రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ఎందుకు కోర్టులో కేసులు వేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. సీఎం వైఎస్ జగన్ అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తూ అమరావతి ప్రాంతంలో 50 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడం హర్షణీయం అన్నారు. వచ్చే నెలలో భీమవరంలో మాలమహానాడు ఆధ్వర్యంలో మాల ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామని మంగరాజు చెప్పారు. రాజారావు, మేషే, సునీల్, సందీప్, గోపి, వెంకట్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

ప్లాస్టిక్ కవర్లు నిషేధించరూ..



ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రజలు



గూడెం మార్కెట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను అక్కడే తగులబెడుతున్న దృశ్యం

పెంటపాడు: ప్లాస్టిక్ భూతాన్ని నిషేధించే విధానం అమలు కావడంలేదు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల నిర్మూలన పట్ల అధికారులకు చిత్తశుద్ధి కనిపించడం లేదు. పర్యావరణ కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉంది. గూడెం డివిజన్‌లో పరిధిలోని పెంటపాడు మండలం, రూరల్, పట్టణాల్లో యథేచ్ఛగా పాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధిస్తూ సంబంధింత ఆజ్ఞలను గత ఏడాది డిసెంబర్ నెలలో జారీ చేశారు. కానీ అమలు మాత్రం లోప భూయిష్టంగా ఉంది. ఏళ్ల క్రితమే పంచాయతీ పాలకవర్గాలు ప్లాస్టిక్ ను నిషేదిస్తూ తీర్మానాలు చేసినప్పటికీ అధికారుల్లో శ్రద్ధ కానరావడం లేదు. ఏదో తూతూ మంత్రంగా కొద్ది రోజులు హడావుడి చేయడం తప్ప పూర్తి నిషేదానికి చొరవ కనపరచడం లేదు. దీంతో ఈ ఆశయం అభాసుపాలవుతోంది. ఒక్కొక్క నియోజవర్గం పరిధిలోని మూడు, నాలుగు మండలాల్లో రోజుకు ఒక అర టన్ను క్యారీ బ్యాగులు వినియోగిస్తున్నారని ఒక అంచనా వేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కాగా ఈ వేసవిలో ఆ కవర్ల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. మార్కెట్ కు ఖాళీ చేతులతో వెళ్లి రెండు చేతుల నిండా సరుకులు నిండిన ప్లాస్టిక్ కవర్లతో ఇంటికి వస్తున్నారు. ఇలా నిత్యం జరుగుతోంది. భూమి, నీరు, వాయువులు కలుషితం అవుతున్నాయి. భూగర్భ జలాలు దెబ్బతిని సారవంతమైన పంట భూములు నిస్సారమవుతున్నాయి. పాస్టిక్ వాడకం వల్ల ప్రమాదకర క్యాన్సర్‌లు వ్యాపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థతో పాటు, ఎర్రరక్తకణాలు, కాలేయం, మూత్రపిండాలపై వీటి ప్రభావం చూపుతోంది. ప్లాస్టిక్ కాల్చితే వచ్చే లిక్విడ్ హైడ్రో కార్బన్ వాయువు వలన గాలి కలుషితమవుతోంది. పిల్లలు పలు రకాల లోపాలతో పుడుతున్నారు. క్యారీబ్యాగుల్లో సిగమెంట్లు, పాస్టిసైజర్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ఉండటం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ర్యాలీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీలు ఉత్తమ అవార్డుల్లో భాగంగా పలు అంశాల్లో అవార్డులు పొందలేక పోవడానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ వాడకమే అని తేలింది.

ముందస్తు జాగ్రత్తలు మేలు

నిత్యావసరాలకు జూట్, పేపరు, కాటన్ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అపరాధ రుసుం విధించాలి. దుకాణాదారుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా ప్లాస్టిక్ బ్యాగుల నిషేదాలపై ప్రజలను భాగస్వాములు చేయాలి.

చర్యలు తీసుకొంటాం



ప్లాస్టిక్ బ్యాగులను వాడరాదంటూ గతంలో పంచాతీల్లో మైక్ ప్రచారం చేయించాం. అన్ని సచివాలయాలకు నోటీసులు ఇచ్చి ఆదేశాలు జారీ చేశాం. వ్యాపారులకు అవగాహన కల్పించాం. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వివరించాం. త్వరలో ప్లాస్టిక్ వాడకాలను తగ్గించకుంటే చర్యలు తీసుకొంటాం.

– వైవీఆర్. ప్రసాద్, పెంటపాడు మండల ఈవోపీఆర్డీ

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం



ప్లాస్టిక్ వినియోగం మానవాళితో పాటు, మూగజీవాలకు కూడా ప్రమాదకరం. రోడ్లపక్కన, డ్రైనేజీల్లో ఆహారం అనుకొని కవర్లను కూడా అవి తినివేస్తుంటాయి. దీంతో అవి జీర్ణం కాక ప్రధానంగా పశువుల్లో తీవ్రమైన వ్యాధులు వస్తున్నాయి. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. కొంచెం కష్టమైనా చేతి సంచుల వెంట తీసుకెళ్లాలి. జనపనారతో సమస్యలు రావని గమనించాలి. పాస్టిక్ బ్యాగులు వాడకం వల్ల తరచూ రోగాల భారిన పడే అవకాశాలు ఉన్నాయి.

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ చంద్రిక



ఉపాధి హామీ పథకం పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీలైనంత ఎక్కువ మందికి పనిదినాలు కల్పించాలన్నారు. జాబ్ కార్డులు కావాల్సిన వారు సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఉపాధిహామీ పథకం సిబ్బంది ఉన్నారు.

ఆంజనేయస్వామికి అష్టోత్తర పూజలు



శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో మంగళవారం ఆంజనేయస్వామికి అష్టోత్తర పూజలు జరిగాయి. మన్యసూక్త విధానంతో మూల మంత్రంతో నవగ్రహ ఆరాధన, అష్టదిక్పాలక పూజ, పంచపాలక పూజలు, హోమ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరైయారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

ఎంహెచ్‌పీ ప్రోగ్రాంను విజయవంతం చేయాలి



అవగాహన సమావేశంలో మట్లాడుతున్న డాక్టర్ కోమలి, తదితరులు

పెంటపాడు: మెంటల్‌హెల్త్ ప్రోగ్రాం(ఎంహెచ్‌పీ) చికిత్సపై సిబ్బంది సరైన అవగాహన పెంచుకొని ఆ వ్యాధి నివారణపై సమిష్టి కృషి చేయాలని ఉమ్మడి జిల్లా మానసిక వ్యాధుల చికిత్సా నిపుణులు డాక్టర్ కోమలి పేర్కొన్నారు. మంగళవారం ముదునూరు ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం వద్ద డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో సిబ్బందికి మానసిక వ్యాధులపై అవగాహన, చికిత్సా విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ సత్యనారాయణ, ఎస్వీవీ సత్యనారాయణ, పీహెచ్‌ఎస్ టీవీ ప్రసన్న, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

దేశ శాంతి కోరుతూ సైకిల్ యాత్ర



గూడెంలో ఆలయంలో పూజలు అనంతరం సైకిల్ యాత్ర చేస్తున్న గోపాలకృష్ణ

పెంటపాడు: దేశ శాంతిని కాంక్షిస్తూ కర్ణాటకకు చెందిన గోపాలకృష్ణ సైకిల్ యాత్ర చేపట్టాడు.ఈ దైవదర్శన సైకిల్ యాత్ర యానాం కేంద్ర పాలిత రాంతంతోపాటు 15 రార్ష్టాలను చుట్టిముట్టి ఇప్పుడు చిన్నతిరుపతికి చేరింది. మంగళవారం ఈ యాత్ర పెంటపాడు మండలం ప్రత్తిపాడు, గూడెం పట్టణం మీదుగా ద్వారకా తిరుమలకు పయనమైంది. అనంతరం అమరావతిలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేపట్టిన హోమాలను దర్శించి కాశీకి వెళ్లనున్నట్లు గోపాలకృష్ణ వివరించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం



ప్రమాదంలో కాలిపోతున్న పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్

తణుకు: ఎండల వేడితోపాటు విద్యుత్ ఓవర్ లోడ్ కారణంగా తణుకు డీ1 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక వీమాక్స్ థియేటర్ సమీపంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఎండల వేడి కారణంగా ఆయిల్ మరిగిపోయి ఈ ప్రమాదం జరిగిందని ఏడీఈ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా అత్తిలి, ఇరగవరం మండలాల పరిధిలోని కొద్ది సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పటికీ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు.

అంబేడ్కర్‌ను విస్మరించిన చంద్రబాబు

తణుకు అర్బన్: దళిత వర్గాలంటే చులకనగా చూసే చంద్రబాబు తన వంకర బుద్ధి చూపించారని వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు విమర్శించారు. ఇటీవల రైతు పోరుబాట పాదయాత్రలో భాగంగా తణుకు వచ్చిన చంద్రబాబు పాదయాత్ర దారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకపోవడం ఆయన అగ్రకుల అహంకారాన్ని చూపించారని దుయ్యబట్టారు. తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల ఎస్సీసెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, కోరుకొల్లు వెంకట్రావు, గోగి బాపిరాజు, పెనుమాల రాజేష్‌లు చంద్రబాబు వైఖరిని ఖండించారు. అంబేడ్కర్ నామస్మరణ చేస్తూ దళిత వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసే చంద్రబాబు కనీసం అటువైపు కూడా చూడకపోవడం దారుణమని విమర్శించారు.

తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్యాంబాబు

తణుకు టౌన్: తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం శ్యాంబాబు మంగళవారం విధుల్లో చేరారు. రాష్ట్ర కళాశాల విద్యా శాఖ ఉత్తర్వుల మేరకు ఇప్పటి వరకూ ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు పెంటపాడు డాక్టర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ కాగా, అక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎం శ్యాంబాబు బదిలీపై తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం విధుల్లో చేరారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్: సమగ్ర శిశు అభివృద్ధి తాడేపల్లిగూడెం ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో నాలుగు అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి ఈ నెల 23వ తేది సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో టి.లక్ష్మీసరస్వతి తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ పరిధి 31వవార్డు బీసీ(ఈ), 18వ వార్డు దృష్టి లోపం ఉన్న వారు, 10వ వార్డు ఎస్టీ, పెదతాడేపల్లి–2 పరిధి బీసీ(ఏ)లకు రిజర్వు కాబడ్డాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, 2023 జులై 1వ తేది నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, స్థానికులైన మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో దరఖాస్తులను గణపవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని తాడేపల్లిగూడెం ఐసీడీఎస్‌ప్రాజెక్టు కార్యాలయం చిరునామాకు పంపించాలని సూచించారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తణుకు టౌన్: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాలీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఎంబీఎస్ ప్రమోద కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలోని అంగన్‌వాడీ సహాయకురాలి బీసీ ఏకు, అత్తిలి మండలం మంచిలి గ్రామంలోని 3వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలి పోస్టును బీసీ బీలకు, ఇరగవరం మండలం కాకిలేరు గ్రామంలోని నెం 1 కేంద్రంలోని సహాయకురాలి పోస్టును, ఇరగవరం గ్రామంలో నెంబరు 6వ అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలి పోస్టును, తణుకు మండలం మండపాక గ్రామంలోని నెంబరు 5 అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులను ఎస్సీలకు రిజర్వు చేసినట్లు తెలిపారు. తణుకు పైడిపర్రులోని 4వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి పోస్టును ఓపెన్ అభ్యర్థులకు రిజర్వు చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానికులై, ఈసంవత్సరం జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని తెలిపారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అదనపు అర్హతలున్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలోపు తణుకు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఉపాధి హామీని నీరుగార్చేందుకు కేంద్రం ఎత్తుగడలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని, దీన్ని కూలీలంతా ఐక్యంగా కాపాడుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన రూ.15లు కూలీతో కలిపి రూ.272లు ఎక్కుడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కూలీలంతా ఐక్యతతో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, జి.సత్యనారాయణ, నూనె నాగేశ్వరరావు, సూర్యకుమారి, మునకాల పెద్దిరాజు, మానుకొండ విమల, ఘంటా బేబి, మానుకొండ రత్తమ్మ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పక తీసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేసవి జాగ్రత్తలు ప్రజలందరూ తప్పక తీసుకోవాలని ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జీ అన్నారు. పట్టణంలో ఆర్గనైజేషన్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు గొడుగు, మంచినీరు బాటిల్, తలకి టోపి ధరించాలని సాధ్యమైనంత వరకు మంచి నీరు ఎక్కువ తాగాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీడపాటున ఇంటి వద్ద ఉంటే వడదెబ్బ తగదలన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో నెహ్రూ జీవితచరిత్ర, సీనియర్స్ విభాగంలో నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిపారు. న్యాయ నిర్ణేతలుగా టీచర్ డేవిడ్‌రాజు, రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు వ్యవహరించారు. కార్యక్రమంలో రీడర్స్ ఫోరం సభ్యులు పి వెంకటేశ్వరరావు, జి గణపతి, అమర్, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రేడ్ –1 గ్రంథాలయంలో విజ్ఞాన తరగతులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణా విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 9వ రోజు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థినీ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులైన ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, బాపయ్య శర్మలు విద్యార్థులకు వివిధ అంశాల్లో విద్యా అంటే ఏమిటి? అక్షరాస్యత, విజ్ఞానం, గౌరవ మర్యాదలు, తెలుగు పాఠ్యాంశాలు, ఆటలు, సైన్స్, ఇంగ్లీషు గ్రామర్, నీతి పద్యాలు, హిందీ, లెక్కలు బోధించారు.

విద్యార్థుల నమోదు శాతం పెంచడానికి సహకరించాలి



ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం దత్

అత్తిలి: విద్యకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్, జగనన్న గోరుముద్ద, ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన, అమ్మఒడి వంటి పథకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. ఈపథకాలు ఉపయోగించుకుని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ శాతం నమోదు కావాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది తమ పూర్తి సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాల నమోదు శాతం పెంచడానికి పాఠశాల ఉపాధ్యాయులు డీఎంజీ ప్రసాద్, వై శ్రీకాంత్, ఎస్‌కే షరిఫ్మల, టి ఆత్మలింగం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆకుల మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే మిన్న



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఉన్నత ప్రమణాలే లక్ష్యంగా నేటి రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏఎస్ఆర్ మూర్తి, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావులు విజ్ఞప్తి చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం 19వ వార్డు భాగ్యలక్ష్మిపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన బాగుందని, ప్రభుత్వం కల్పించే రాయితీలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నీరుకొండ పండు, ఉపాధ్యాయులు పి.శివప్రసాద్, ఎస్.భువనేశ్వరి, ఎన్‌సీసీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే వ్యాధుల వ్యాప్తి నియంత్రణ



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది



గూడెంలో డెంగీ జాతీయ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

తణుకు అర్బన్: దోమల నివారణతోనే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుప్రియ, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఫైలేరియా కంట్రోల్ యూనిట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది మే 16న జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించి డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. టైగర్ దోమ కాటు ద్వారా వ్యాపించే డెంగ్యూ వ్యాధి జ్వరంతో బయట పడుతుందని చెప్పారు. పగలు మాత్రమే ఈ దోమ కుడుతుందని, దోమ పుట్టుకకు కారణమైన లార్వా దశలోనే చెక్ పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో అవసరం లేని నీటి నిల్వలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు సమిష్టి పోరు సాగిద్దాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): సమర్థవంతమైన భాగస్వామ్యంతో డెంగీ నివారణకు సమిష్టి పోరు సాగిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం మంగళవారం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ కే.ఆషాలత, చైతన్య, ఎస్,అమృత, శ్రావ్యలు హాజరైయారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణే లక్ష్యంగా చేయి చేయి కలిపి ముందకు సాగుదామన్నారు. దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, డ్రై డేలు పాటించాలని తదితర సూచనలు చేశారు. ఆరోగ్య సహాయకులు, ఆశాలు, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిలా ‘గూడెం’

- ఉదయం 11 గంటలకే 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- సాయంత్రం 6.30 గంటలకూ 40 డిగ్రీల సెల్సియల్ ఉష్ణోగ్రతలు



తాడేపల్లిగూడెం తాలూకాఫీస్ సెంటర్‌లో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన దృశ్యం



ఎండ తీవ్రతకు చెంగు మాటున మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గత రెండు రోజులుగా నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. రోహిణి కార్తె ప్రవేశించకుండానే భానుడు నిప్పులు చెరుగుతుండటంతో సోమ, మంగళవారాలు 44 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలోనే 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. దీంతో ప్రజలు వేసవి ఉష్ణోగ్రతలకు ఉక్కిరిబిక్కిరయ్యారు. దీనికి తోడు వేడి గాలులు వీయడంతో రోడ్లపై సంచరించాలంటే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 1 గంటకు తాడేపల్లిగూడెం పట్టణంలో రద్దీగా ఉండే పోలీస్ ఐలాండ్‌సెంటర్, శేషమహల్ సెంటర్, తాలూకాఫీస్ సెంటర్, గొల్లగూడెం, ఎస్వీఆర్ సెంటర్, మసీదు సెంటర్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అంతే కాకుండా కొనుగోలుదారులు లేక వ్యాపార దుకాణాలు సైతం వెలవెలబోతున్నాయి. తిరిగి సాయంత్రం 6 గంటల తర్వాతే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల కావస్తున్నా 40 డిగ్రీ సెల్సియస్ దిగువకు ఉష్ణోగ్రతలు రావడం లేదు. దీనికి తోడు రాత్రి సమయాల్లో మరింత ఉక్కపోత పెరుగుతుండటం విశేషం. రోహిణి కార్తెలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్రలో వైభవంగా రథోత్సవం

పెనుమంట్ర: ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర పంచాయతీ చెరువు ఒడ్డున ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు, శ్రీ పుంతలోముసలమ్మవారి 14వ వార్షిక తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో జరిగిన శోభాయాత్ర , రథోత్సవ కార్యక్రమా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పల్లపువీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దాసాంజనేయస్వామిని, శ్రీ పుంతలో ముసలమ్మ వారిని దర్శించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ దాసాంజనేయస్వామిని రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రామాయణ అంతర్గత అంశాలపై 15 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి బహుమతిగా బంగారు హనుమాన్ ప్రతిమను గెలుచుకున్న పిల్లా సాయిరోహిత్ (13) అనే విద్యార్థికి స్వామివారి ప్రతిమను రంగరాజు చేతులమీదుగా అందజేశారు. ముందుగా రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రథం లాగారు.